క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన మున్సిపల్ కమిషనర్



ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్ జయరాం

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరను మున్సిపల్ కమిషనర్ జయరాం మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం రాత్రి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ముగించుకుని వచ్చిన రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో కమిషనర్ కలిసి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. మంజూరైన పనులు త్వరగాగా పూర్తిచేయించాలని ఈ సందర్భంగా రాజన్నదొర కోరారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ సూరినాయుడు ఉన్నారు.

రైతులు ఈకేవైసీ చేసుకోవాలి



లక్ష్మీపురంలో మాట్లాడుతున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు పండిస్తున్న పంటలను విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన లచ్చయ్యపేట, లక్ష్మీపురం, బుడ్డిపేట, కాశీపేట గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు పంటపొలాల్లో చేస్తున్న ఈకే వైసీ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర పతకాల ద్వారా లబ్ధిపొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వ్యవసాయ సహాయకులు, సచివాలయ కన్వీనర్లు, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుచ్చిమిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



గుచ్చిమిలో సర్వేను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరరావు

సీతానగరం: సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం జోగింపేట, గుచ్చిమి, సీతారాంపురం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ క్రమంలో గుచ్చిమిలో ఏఎన్ఎం, ఆశ, పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శంకరరావు పరిశీలించారు.

జీపీఎస్‌పై పునరాలోచన చేయాలి

పాలకొండ రూరల్: సీపీఎస్ స్థానంలో అమలు చేయదలచిన జీపీఎస్‌ను ప్రభుత్వం రద్దు చేసి, పునరాలోచన చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ కోరింది. ఎంఈఓ కార్యాలయం వద్ద తమ మిత్ర సంఘాలైన ఏపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ సభ్యులు జీపీఎస్‌కు వ్యతిరేకంగా శుక్రవారం నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జోనల్ కన్వీనర్ కె.అప్పలనాయుడు జీపీఎస్ అమలు వలన కలిగే తమ సందేహాలు వివరించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు యంత్రాంగం ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, సభ్యులు బీవీ.రమణ, ఎస్.వాసుదేవరావు, పి.హేమనికుమార్, ఉపేంద్ర, రాంబాబు, నాగరాజు, నందయ్య పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయులకు శుక్రవారం వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి పలు సూచనలిచ్చారు. ఇక్కడ డీఆర్‌పీలు చెప్పిన అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఎంఆర్‌సీ ఏఎంఓ పి.కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సీఎంఓ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంపు

గరుగుబిల్లి: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదవ తరగతి, ఇంటర్ మీడియెట్‌లో చేరేందుకు ఫీజు గడువును పెంచినట్టు విద్యా పీఠం మండల కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్‌మీడియెట్‌లో ప్రవేశానికి అపరాధ రుసుంతో చెల్లించేందుకు ప్రభుత్వం గడువును పెంచిందన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు కోర్డినేటర్ 89853 85367 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమస్యల రహితంగా తీర్చిదిద్దుతాం

- రచ్చబండలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు



రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సమస్యల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బందలుప్పి, చప్పవానివలస, నిమ్మవానివలస, అంటివలస గ్రామాలను సందర్శించి గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల వద్దకు వెళ్లి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఆయా గ్రామాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చిన గ్రామ సమస్యల పరిష్కారం ఏదశలో ఉందో స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు ఆయా అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామస్తుల కోరిక మేరకు ఇంటింటి కుళాయి నీరు అందించామని చెప్పారు. గ్రామాల సమస్యలు పరిష్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు యాళ్ల ఈశ్వర ప్రతాప్, గోర్జి రాజు, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, పార్టీ నాయకులు మజ్జి శేఖర్, యాళ్ల శ్రీరాములు నాయుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆధ్వర్యంలో పార్వతీపురం మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం పరిధిలో నిర్వహించ తలపెట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే అన్ని వార్డులలో కూడా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన పురపాలక యంత్రాంగం వచ్చే నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, పూర్తి స్థాయిలో అన్ని కాలువలు శుభ్రం చేయనుందని సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే బదులిచ్చారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు, ఫ్లోర్‌లీడర్, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఫౌల్ట్రీఫార్మా రైతులు

పీఏసీఎస్ సొసైటీ ఫౌల్ట్రీ ఫార్మ్ రైతులు ఎమ్మెల్యే అలజంగి జోగారావును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ స్కీంలు అమలు చేసి రైతులకు అన్ని విధాలా ఆదుకుంటున్న క్రమంలో తమకు ఆర్థిక సహకారం అందించి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు, పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ భీమవరపు కృష్ణమూర్తి, వైస్‌ఎంపీపీ బంకురు రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఫౌల్ట్రీఫార్మారైతులు తదితరులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తయారీ



మిర్తివలసలో తయారు చేస్తున్న ద్రావణం

బలిజిపేట: మండలంలోని మిర్తివలసలో గల డాక్టర్ శ్రీనివాస్ బయో ఇన్పుట్ సెంటర్‌లో ద్రవ జీవామృతాన్ని శుక్రవారం తయారుచేసి రైతులకు అవగాహన కల్పించారు. ఎంసీఆర్‌పీ లక్ష్మి ద్రావణం తయారీ విధానం, వినియోగం, ప్రయోజనాన్ని రైతులకు వివరించారు. 4వేల లీటర్ల జీవామృతం తయారీకి 400లీటర్ల గోమూత్రం, 200కిలోల పేడ, 40కిలోల బెల్లం, 40కిలోల శనగపిండి, పుట్టమన్ను అవసరం ఉంటుందని చెప్పారు. వీటిని నీటిలో కలిపి తయారుచేయాలని సూచించారు. వరిచేనుకు దీనిని వినియోగించుకోవచ్చని, బయోమెట్రిక్ ఇన్పుట్ సెంటర్‌నుంచి దీనిని కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల దిగుబడి పెరుగుతుందని, చీడపీడల నుంచి నివారణ లభిస్తుందని, పెట్టుబడి తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష
ఏర్పాట్ల పరిశీలన



పలగరలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జగన్మోహన్ రావు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామంలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు శుక్రవారం పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, సర్వేవైటల్ ఏరియా, రిజిస్ట్రేషన్ కౌంటర్, రోగులు వేచి ఉండే స్థలం, వైద్యులు, ల్యాబ్ పరీక్షల గది, ఫార్మసీ తదితర కౌంటర్లకు స్థలాలను పరిశీలించారు. అదే విధంగా కంటి తనిఖీలు, ఐసీడీఎస్ కౌంటర్‌ను చూశారు. శిబిరంలో వైద్యసేవలు వినియోగించుకునే ప్రజలకు అర్థమయ్యే విధంగా కౌంటర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని చెప్పారు. బయోమెడికల్ వేస్ట్ మెటీరియల్ వేసేందుకు డస్ట్‌బిన్స్ ఉంచాలన్నారు. వలంటీర్ల పరిధిలో ఉండే రోగులు శిబిరానికి వచ్చే విధంగా శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఆర్ఓ అప్పలరాజు, ఎంఈఓ సామల సింహాచలం, వైద్యాధికారి శశిధర్, కార్యదర్శి గౌరీశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష

సీతానగరం: కలెక్టర్ సూచనల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) పథకం ద్వారా పక్కాగా స్పెషలిస్టులైన డాక్టర్లతో వైద్యపరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లుచేసి అవసరమైన వైద్యసేవలు అందించడానికి సమాయత్తం కావాలని తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బూర్జలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరం ఏర్పాట్లపై డాక్టర్ రాధాకాంత్ అధ్యక్షతన వైద్యారోగ్య శాఖ, డిజిటల్ సహాయకులు పంచాయతీరాజ్, రెవెన్యూ అధికార సిబ్బందితో శుక్రవారం సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు ప్రభుత్వ వైద్యాధికారులతో పాటు ఇద్దరు వైద్య స్పెషలిస్టు లతో బూర్జ సచివాలయం పరిధిలో ఉన్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో కూపన్లు సమకూర్చిన వారందరికీ వైద్యసేవలు అందించాలని కోరారు. ఇంతవరకూ అధికారసిబ్బంది నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో కూపన్లు ఇచ్చిన వారందరూ ఉచితవైద్యశిబిరంలో పాల్గొనేలా సచివాలయ ఉద్యోగులు గృహసారథులు, గ్రామవలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ బూర్జ ఉన్నత పాఠశాల ఆవరణలో నలుగురు వైద్యాధికారుల బృందంతోపాటు పదుల సంఖ్యలో పాల్గొనే పారామెడికల్ సిబ్బంది వైద్య సేవలందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బూర్జ సర్పంచ్ జి. దాసు, వివిధ శాఖలకు చెందిన అధికార సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 5న చలో స్టీల్ ప్లాంట్



పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

పార్వతీపురం: విశాఖ ఉక్కు రక్షణ కోసం అక్టోబర్ 5న తలపెట్టిన చలో స్టీల్ ప్లాంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు జి.వేణు, జీవీ.రమణ, కె.రామస్వామి, ఆర్.శ్రీదేవిలు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అక్టోబర్ 5న పాల్గొనే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించి ఉత్తరాంధ్ర ప్రజలను అన్యాయం చేయాలని చూస్తోందని ఈ సందర్భంగా విమర్శించారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు అన్నారు. మండలంలోని కప్పకల్లు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు పత్రికల్లోనూ, 120 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు సోషల్ మీడియాలోనూ చేస్తున్న ప్రచారాలపై గిరిబాబు శుక్రవారం స్పందించారు. కప్పకల్లు గ్రామంలో మొత్తం 32 కుటుంబాలు మాత్రమే ఉండగా 50 కుటుంబాలు చేరాయని, 150 కుటుంబాలు చేరాయని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

బొత్తిలిలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు వినతి

కురుపాం: మండలంలోని ఏగులవాడ పంచాయతీ బొత్తిలి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. రజ్జిలి పోలింగ్ స్టేషన్ పరిధిలో కొండల మధ్య ఉన్నటువంటి సెంటర్‌గూడ, కొండగూడ, బొత్తిలి గ్రామాల్లో సుమారు 200 మంది ఓటర్లు ఉన్నారని వీరు రజ్జి పోలింగ్ స్టేషన్‌కు రావాలంటే మొండెంఖల్ గ్రామం మీదుగా 30 కిలోమీటర్లు దూరంలో ఉన్న రజ్జిలి పోలింగ్ స్టేషన్‌కు రావాలని అందువల్ల కేవలం మూడు గ్రామాల నుండి 20శాతం ఓటర్లు మాత్రమే వస్తున్నారని తెలిపారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బొత్తిలిలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఆర్‌డీఓలకు విన్నవించినట్టు తెలిపారు.

మామిడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 'నా మట్టి నాదేశం'



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సాలూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని మామిడిపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో నా మట్టి నాదేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దేశాన్ని గౌరవించాలని ఉపాధ్యాయులు సూచించి ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. జేఏఎస్‌ను ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఆన్‌లైన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. వైద్యసేవలు పొందిన వారికి ప్రభుత్వ యంత్రాంగం అవసరమైన సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, మండల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం

- రానున్న 6 నెలలు ఎంతో కీలకం
- 45 రోజుల పాటు ప్రజలతో మమేకమయ్యేలా కార్యక్రమాలు
- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం
- వచ్చేనెల 11 నుంచి ఎందుకు జగన్ ఆంధ్రాకు కావాలి..?
- ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు విజయవంతంలో కీలక పాత్ర పోషించాలి
- ప్రతి గ్రామం, వార్డులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో దిశానిర్దేశం చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స



వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

విజయనగరం: రాష్ట్రంలో 2024లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో వైఎస్సాసీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా... వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. నాలుగన్నరేళ్ల ప్రభుత్వ పాలన ఒక భాగమైతే రానున్న 6 నెలలు ఎంతో కీలకమని, 2019 ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో నమోదైన ఫలితాలను మరోసారి సాధిద్దామన్నారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన పూల్‌బాగ్ ప్రాంతంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి అంజలి ఘటించారు. ముఖ్యమంత్రి 45 రోజుల పాటు ప్రజలతో మమేకమయ్యేలా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజారోగ్యమే పరమావధిగా ఈ నెల 30 నుంచి ప్రభుత్వం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలు ఆయా సచివాలయాల పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు,ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు,పార్టీ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

11 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..?'

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వచ్చే నెల 11 నుంచి ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..? అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వై.వి.సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ వెల్లడించారు. సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ మండలాధ్యక్షులు, ఇతర మండల స్థాయి ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు.

- మొదటిరోజు ఆ సచివాలయం పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించాలన్నారు. అనంతరం అదే ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, అక్కడే రాత్రి చేసి పార్టీ బలోపేతంపై చర్చించాలన్నారు.
- రెండవరోజు సచివాలయం పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి 'ఆపు బాబు నాటకం–జగనే మా నమ్మకం' అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అదే సందర్భంలో పార్టీ రూపొందించిన ప్రత్యేక కరపత్రాల ద్వారా 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు, 2019 ఎన్నికలకు ముందు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేసిన విధానాన్ని వివరించడంతో పాటు ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు.

రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాలన



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పారదర్శకమైన పాలన సాగిస్తోంది. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు సాగాయి. ఒక్క సాలూరు నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు రూ.1000 కోట్ల లబ్ధి చేకూరింది. వచ్చేనెల 11 నుంచి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..? కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. కార్యక్రమంలో చంద్రబాబు చేసిన మోసాలను, జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రజలకు వివరించాలి.

– పీడిక రాజన్నదొర, ఏపీ డిప్యూటీ సీఎం

కలిసికట్టుగా సాగుదాం



గడిచిన నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. మన ప్రభుత్వ పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఎంతో మేలు జరిగింది. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించాం. ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. ప్రభుత్వ మెడికల్ కళాశాలను సాకారం చేసుకున్నాం. సాగు నీటి ప్రాజెక్టుల మిగులు పనులు పూర్తిచేసుకుంటున్నాం. తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచుతాం. నియోజకవర్గాల్లో నేతలమధ్య సమన్వయం కొరవడింది. కొందరు ఎమ్మెల్యేలు చక్రవర్తుల్లా వ్యవహరిస్తుంటే... ఎంపీపీలు సామంతరాజుల్లా నడుచుకుంటున్నారు. ఎవరికైనా సమస్యవస్తే ఒకవైపే కాస్తున్నారు. అది సరికాదు. అందరినీ సమదృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించుకోవాలి. వ్యక్తులు కాదు పార్టీ ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలి. మరల జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మన అందరికీ పదవులు వచ్చి గౌరవం దక్కుతుంది. రానున్న ఆరు నెలలు పార్టీ శ్రేణులంతా ఉత్సాహంగా పనిచేయాలి. సోషల్ మీడియా మరింత దూకుడు పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు టీడీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టాలి.

– బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

ఇదొక సువర్ణావకాశం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు 45 రోజుల పాటు రూపొందించిన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు ద్వారా ప్రజలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మమేకమయ్యేందుకు సువర్ణావకాశం. గత చంద్రబాబు పాలనలో జరిగిన మోసాలను, దోపిడీలను వివరించేందుకు ఇదొక చక్కటి వేదిక. 30 నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు, వచ్చే నెల 11 నుంచి జరిగే ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి..? కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఫలితాలు 2024 ఎన్నికల్లో పునరావృతం చేయాలి. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం